ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 10 మే 2024



రెండు రోజులే మిగిలింది

- దూకుడు పెంచిన పార్టీలు
- పెరిగిన స్థానిక నాయకుల ప్రచారాలు
- సిరిసిల్ల, వేములవాడలో వేడెక్కుతున్న రాజకీయం

- 8లో..

కరీంనగర్ స్ఫూర్తి, దీవెనలతోనే రాష్ట్రసాధన



మాట్లాడుతున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

- ఎనిమిది శాతం ఓట్లతో వినోద్ గెలుపు ఖాయం
- 150 హామీల్లో ఒక్కటీ నెరవేర్చని బీజేపీ
- బండి సంజయ్‌తో పైసా పనికాలేదు
- వినోద్‌కుమార్ కృషితోనే కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ
- బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్

కరీంనగర్, మే 9(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ పాత్ర కీలకం.. ఉద్యమాల గడ్డ కరీంనగర్ స్ఫూర్తి, దీవెనలతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. గులాబీ జెండా ఎత్తుకొని ఎస్ఆర్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో జై తెలంగాణ నినాదంతో ముందుకు సాగిన నన్ను ఆశీర్వదించిన గడ్డ కరీంనగర్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలి దశ ఉద్యమంలో భాగంగా కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరితే రాజీనామాతో కరీంనగర్ నుంచి పోటీచేశానని, అప్పుడు 2.50 లక్షల మెజార్టీతో గెలిపించారని కేసీఆర్ గుర్తుచేశారు. ఎప్పుడు కరీం నగర్‌కు వచ్చిన బ్రహ్మాండంగా స్వాగతించారని, కరీంనగర్‌కు నా హృద యంలో ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అటువంటి ఉద్యమ స్ఫూర్తిని మళ్లీ చాటి ఎంపీగా ఉద్యమనేత, మేధావి, న్యాయవాది బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి కరీంనగర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వినోద్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన బస్సుయాత్ర, రోడ్ షో సందర్భంగా తెలంగాణ చౌక్‌లో ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. కరీంనగర్‌లో నా సర్వే ప్రకారం 8శాతం ఓట్ల ఆధిక్యతతో వినోద్‌కుమార్ ముందంజలో ఉన్నారని, ఆయన గెలుపు ఖాయమైందని అన్నారు.

కరీంనగర్‌లో ముస్లిం మైనార్టీలు ఆలోచించాలని, మీరు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీజేపీ అభ్యర్థి గెలుస్తాడని, మత విద్వేషాలు రెచ్చగొట్టే బండి సంజయ్‌ని ఓడించి, సెక్యులర్ వాది, ఉద్యమ కార్యకర్త వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ భావోద్వేగాల బ్లాక్ మెయిల్ ఇలాగే కొనసాగితే దేశం సర్వనాశనమవుతుందన్నారు. పదేళ్ల క్రితం 150 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ, నరేంద్రమోదీ అందులో ఒక్క హామీని కూడా నెర వేర్చలేదని ఆరోపించారు. మోదీకి ముందు 14 మంది ప్రధానమంత్రులు చేశారు.. వారు 55 లక్షల కోట్ల అప్పుచేస్తే మోదీ ఒక్కడే 105 లక్షల కోట్ల అప్పు చేశారని, రూపాయి విలువ 84కు పడిపోయిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ జరుగలేదు.. ఏ ఒక్కరికి మేలు జరుగలేదని కేసీఆర్ విమర్శించారు. ఢిల్లీలో రైతులు ధర్నా చేస్తే 750 మందిని బీజేపీ ప్రభుత్వం పొట్టనబెట్టుకుందని, ఆ తర్వాత జరిగిన హర్యానా ఎన్నికల్లో గట్టెక్కేందుకు మోదీ రైతులకు క్షమాపణ చెప్పారని అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్ నలుగురు బీజేపీ ఎంపీలు గెలిచినా నాలుగు రూపాయల పనిచేయలేదని, బండి సంజయ్ ఒక్క పనిచేశాడా... గ్యాస్ మాటలు... లొడలొడ వాగుడు, పార్లమెంట్‌లో ఆయన మాట్లాడితే ఎవరికి అర్థం కాదన్నారు.

కాంగ్రెస్ ఇచ్చినహామీల్లో ఒక్కటి మాత్రం అమలు చేశారని, అదీ ఉచితంగా బస్సుల్లో మహిళలకు ప్రయాణం చేయడమన్నారు. అయితే బస్సుల్లో మహిళలు సర్కస్‌లో మాదిరిగా కొట్లాడుకుంటున్నారని, వారే ఈ ఉచితం ఎందుకని తిరస్కరిస్తున్నారన్నారు. రైతు బంధు, రైతుబీమా ఇవ్వడంతో పాటు రెండు దఫాలుగా 30వేల కోట్ల రుణమాఫీ చేశామని కేసీఆర్ చెప్పారు. ఐదెకరాలపై భూమి ఉన్న రైతులు ఏం పాపం చేశారని కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు ఎత్తివేసేందుకే ఈ విధంగా మాట్లాడుతున్నారని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బి.వినోద్‌కుమార్, కరీంనగర్, హుజూరాబాద్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు పాల్గొన్నారు.

రోడ్ షో సక్సెస్

- భారీగా తరలివచ్చిన జనం
- పార్టీ శ్రేణుల్లో జోష్

కరీంనగర్ టౌన్, మే 9: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు కరీంనగర్‌లో నిర్వహించిన రోడ్‌షో విజయవంతమైంది. కేసీఆర్ బస్సుయాత్రలో భాగంగా గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బయలుదేరి 7.45 గంటలకు కరీంనగర్ రాంనగర్‌కు చేరుకోగానే నాయకులు డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ టి.భానుప్రసాద్ రావు, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, ఒడితెల సతీష్‌బాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్ స్వాగతం పలికారు.

కరీంనగర్, చొప్పదండి నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో చేరుకున్న ప్రజలకు కేసీఆర్ అభివాదం చేస్తూ మంకమ్మతోట, ముకరంపుర మీదుగా తెలంగాణ చౌక్‌కు చేరుకున్నారు. అనంతరం కేసీఆర్ 40 నిమిషాలపాటు ప్రసంగించారు. తీగెల వంతెన సాధించిన భీముడు గంగుల కమలాకర్, హుజూరాబాద్ టైగర్ పాడి కౌశిక్‌రెడ్డి అంటూ కేసీఆర్ సంబోధించడంతో కార్యకర్తలు ఈలలతో హోరెత్తించారు.



హాజరైన కార్యకర్తలు, ప్రజలు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 7: పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపెరల్ పార్క్‌లోని గ్రీన్ నిడిల్ సంస్థలో గురువారం స్వీప్ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ జీఎం మతిన్ అహ్మద్, హెచ్ఆర్ మేనేజర్ ఫణి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సిరిసిల్ల రూరల్, మే 9: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమాజంలో జరిగే సంఘటనలపై స్పందించవచ్చని సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులతోపాటు ఉద్యోగాల సాధన కోసం చదువుకుంటున్న ప్రతీ ఒక్కరు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, లీగల్ సెల్ అడ్వకేట్లు జ్యోతి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్య సేవలు

వీర్నపల్లి, మే 9: మారుమూల గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ వైద్య సేవలను అందిస్తున్నట్లు మండల వైద్యాధికారి చిరంజీవి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు జవహర్లాల్ నాయక్ తండా, వన్‌పల్లి, రంగంపేట, మద్దిమల్ల గ్రామాలలో బీపీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు మంజుల, ఇందిర, కీర్తి, సుజాత, ఆశా కార్యకర్తలు సావిత్రి, నవత, జమున తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జనావాసాల్లోకి నెమలి

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో జాతీయ పక్షి నెమలి జనావాసాల్లోకి వచ్చింది. గురువారం 10, 11 వార్డులో వారం రోజులుగా నెమలి సంచరిస్తోంది. కాలనీలోని ఇంటి ఆవరణలో ఉన్న చెట్లపై సందడి చేస్తోంది. నెమలిని ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

సిరిసిల్లకు మెగా క్లస్టర్ వచ్చేలా కృషి

- గత ప్రభుత్వ తప్పిదంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు కష్టాలు
- కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

సిరిసిల్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కార్మికులకు వస్త్ర పరిశ్రమ కష్టాలు రావడానికి గత ప్రభుత్వం చేసిన తప్పిదాలే కారణమని, సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్ వచ్చేలా కృషి చేస్తానని కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. గురువారం సిరిసిల్లలో పద్మనాయక కల్యాణ మండపంలో వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, అనుబంధ సంఘాలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇవ్వాల్సిన రూ.275 కోట్లలో రూ.50 కోట్లు విడుదల చేశామని, మిగతా బకాయిలు వెంటనే విడుదల చేస్తామని అన్నారు. యారన్‌సబ్సిడీ రేపటిలోగా విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. గత ప్రభుత్వం బకాయిలు పెట్టినవారు మళ్లీ ఓట్లు అడుగుతున్నారని, ఇది న్యాయమేనా అని ప్రశ్నించారు. పవర్‌లూం పరిశ్రమకు కరెంట్ సబ్సిడీ 50 శాతం వచ్చేలా చేస్తామన్నారు. పవర్‌లూం షెడ్లకు సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి వంద శాతం ఉచితంగా అందేలా చేస్తామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వారణాసిని రూ.5 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని, వేములవాడకు వచ్చిన ప్రధాని రూ.100 కోట్లు కూడా ఇవ్వలేదని అన్నారు. మోదీ మనకు గాడిదగుడ్డు ఇచ్చారని మళ్లీ ఓటు వేద్దామా? అని ప్రశ్నించారు. పదేళ్లలో రావణ పాలన చేసిన వారు రాముడి పేరుతో మళ్లీ ఓట్లు అడుగుతున్నారన్నారు. కాంగ్రెస్ రాముడి పాలన చేసి చూపెడుతుందన్నారు. వస్త్ర విహార్ పేరుతో సిరిసిల్ల వస్త్రాలు అమ్ముకునేలా ప్రయత్నం చేస్తానని, ప్రతీ కార్మికుడిని లక్షాధికారిని చేస్తానని అన్నారు. సమావేశంలో సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, పట్టణ అధ్యక్షుడు గోలి వెంకటరమణ, వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, సీఐటీయూ కార్యదర్శి మూషం రమేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్క మధు, ఆసాముల సంఘం అధ్యక్షుడు రవీందర్, కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణ, అనమేని నర్సింగరావు, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, అకునూరి బాలరాజు, చక్రధర్‌రెడ్డి, వనిత, చంద్రకళ, గాజుల బాలయ్య పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

● పద్మశాలీలకు తోడుగా ఉంటా..

కరీంనగర్ అర్బన్: పద్మశాలి కులస్థులకు తోడుగా ఉంటానని కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. నగరంలోని పద్మశాలి భవన్‌లో గురువారం ఆ సంఘం నేతలతో రాజేందర్‌రావు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్‌రావు మాట్లాడుతూ కులవృత్తులను రక్షించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇప్పటికే సిరిసిల్ల చేనేత కార్మికులకు చేసే సేవలో నిమిత్తం మేనిఫెస్టో విడుదల చేసినట్లు తెలిపారు. పద్మశాలి కులస్థుల కోసం బండి సంజయ్ చేపట్టిన ఒక్క మంచి కార్యక్రమం అయినా లేదని, ఒక అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేయని సంజయ్ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారా యణగౌడ్, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు మెతుకు సత్యం, మాజీ ఎంపీపీ వొల్లాల కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ అరుకాల వీరేశలింగం, మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలి

అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 9: పార్లమెంట్ ఎన్నికలల్లో సెక్టార్ అధికారులు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ బాధ్యులు సమన్వయంతో విధులను నిర్వర్తించాల ని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సెక్టార్ అధికారులు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ బాధ్యులకు ఈ నెల 12వ తేదీన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, 13వ తేదీన రిసెప్షన్ సెంటర్లవద్ద నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 30 సెక్టార్లు ఏర్పాటు చేశామని, రిజర్వ్ సిబ్బంది ఉంటారని తెలిపారు. ఈ నెల 12న ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ మధ్యాహ్నం లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. సిబ్బంది తమకు కేటాయించిన వాహనంలోనే పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని స్పష్టం చేశారు. 13వ తేదీన రిసెప్షన్ సెంటర్ల వద్ద తగిన ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రమేష్, మాస్టర్ ట్రైనర్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మానాల ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చందుర్తి/రుద్రంగి మే 9: ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. చందుర్తి మండలంలోని రామన్నపేట, ఆశిరెడ్డిపల్లి, జోగాపూర్, రుద్రంగి మండలంలోని మానాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురు వారం రాత్రి తనిఖీ చేశారు. ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేయాలని, సీసీ కెమెరాల ఏర్పాటు, ఎన్నికలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికా రులకు సూచించారు. మానాల గ్రామస్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా సరిహద్దు చెక్ పోస్టును తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్లరాదన్నారు. వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, చందుర్తి, రుద్రంగి ఎస్సైలు శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ బస్సు యాత్ర

- కొత్త చెరువు బండ్ నుంచి
- నేతన్న చౌక్ వరకు రోడ్ షో

సిరిసిల్ల, మే 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గులాబీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బస్సు యాత్ర శుక్రవారం సాయంత్రం సిరిసిల్లకు చేరుకోనుంది. కేసీఆర్ రాక కోసం బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల కొత్త చెరువు బండ్ నుంచి నేతన్న చౌక్ వరకు రోడ్‌షో నిర్వహించనున్నారు. రోడ్ షోలో వెయ్యి మంది కళాకారులతో కవాతు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. రోడ్‌షోను విజయవంతం చేసే దిశగా భారీ జన సమీకరణకు ఏర్పాట్లు చేశారు. గురువారం రాత్రి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్లలోనే బస చేసి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కేసీఆర్ రాక సందర్భంగా సిరిసిల్ల పట్టణాన్ని గులాబీమయంగా మార్చారు. ప్రధాన కూడళ్లు గులాబీ జెండాలతో అలంకరించారు. సిరిసిల్లలో మధ్యాహ్నం నుంచి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అందుకు వాహనదారులు, ప్రయాణికులు సహకరించాలని జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ఏర్పాట్లను బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్ పరిశీలించారు.

కాంగ్రెస్ పార్టీ వద్ద ఫోన్ ట్యాపింగ్ పైసలు

● డబ్బులు ఖర్చు పెట్టి గెలవాలని చూస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ ● కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్



బండి సంజయ్‌ని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

తిమ్మాపూర్, మే 9: కాంగ్రెస్ పార్టీ వద్ద ఫోన్ ట్యాపింగ్ పైసలు ఉన్నాయని కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే, ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావచ్చు అని కరీంనగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిదిలోని అలగునూర్‌లో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మానకొండూర్ నియోజకవర్గ స్థాయి పోలింగ్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బండి సంజయ్ ముఖ్య అతిధిగా హాజరై పోలింగ్ ఏజెంట్లు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పోలింగ్ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసును కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మూసివేసిందని, ఎవ్వరి నోట నుంచి కూడా ఫోన్ ట్యాపింగ్ మాట రావడం లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు మూసివేయచ్చు అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు ఈ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓటుకు వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి గెలించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇక్కడి ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల కమిషన్‌ను బండి సంజయ్ కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేములవాడకు వచ్చి దర్శణం చేసుకుంటే దేశ వ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతుందన్నారు. నరేంద్ర మోదీ వేములవాడ రాజన్న ఆలయంలో దర్శణం చేసుకోవడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు వరంగల్, నిజామాబాద్ జిల్లాకు చెందిన రాజన్న భక్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. కొందరు చాలా మాట్లాడుతున్నారని గతంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో వాళ్లు ఏ చేశారని, ప్రశ్నించారు. వేములవాడ ఆలయానికి నయాపైసా తేలేదన్నారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి డిపాజిట్ గల్లంతైన వ్యక్తి అడ్రస్ లేకుండా పోయారని, మళ్లీ ఇప్పుడొచ్చి మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విరుచుకుపడ్డారు. తాను ఎంపీ అయిన తరువాత వేములవాడ, కొండగట్టు దేవస్థానాల అభివృద్ధికి ప్రసాదం పథకం కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ ఇచ్చామన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే అప్పుడు ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ వేములవాడకు వెళ్లి సంవత్సరానికి వంద కోట్లు చొప్పున నాలుగు వందల కోట్లు ఇస్తానని చెప్పి, తిరిగి వేములవాడ ఆలయ నిధులనే తరలించేందుకు ప్రయత్నం చేశారన్నారు. అప్పుడు పొన్నం ప్రభాకర్ ఎక్కడికి వెళ్లారని, ప్రశ్నించారు. కొండగట్టుకు వంద కోట్లు ఇస్తానని చెప్పిన కేసిఆర్ ఎందుకు ఇవ్వలేదని, గతంలో పొన్నం ప్రభాకర్ ఎందుకు స్పందించలేదన్నారు. కేటీఆర్, పొన్నం ప్రభాకర్ ఇద్దరు స్నేహితులు కాబట్టి దానిపై స్పందించకుండా డ్రామా ఆడారని ఆరోపించారు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారికి నిధులు తీసుకువస్తే తానే తీసుకువచ్చినట్లు స్వయంప్రకటిత మేధావి చెప్పుకుంటున్నారని బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి వినోద్‌కుమార్‌ను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఎంపీ అయిన తర్వాతనే రహదారి నిర్మాణానికి బడ్జెట్ విడుదల చేయడం జరిగిందన్నారు. టెండర్ పిలిచి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి తాను రూ. 51కోట్ల నిధులు తీసుకువస్తే, వినోద్‌కుమార్ రోడ్డు మరమత్మత కోసం కేవలం కోటి రూపాయల నిధులు తెచ్చారన్నారు. ఈ ఎన్నికల్లో రెండో స్థానానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, నాయకులు గడ్డం ఆరుణ్ పాల్గొన్నారు.



తిమ్మాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్, మే 9: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, వేసవి దృష్ట్యా కూలర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో నీటి వసతితోపాటు టెంట్లు, ఎన్నికల సిబ్బందికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ మేరకు బడ్జెట్ కేటాయించినట్లు చెప్పారు. అధికారులు పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన స్కూళ్లలో మరమ్మతు పనులు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన స్కూళ్లలో విద్యుత్ సరఫరా లోపాలను సరిచేసి ఫ్యాన్లు, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలన్నారు. మరుగుదొడ్ల వద్ద నీటి సరఫరా ఉందా లేదా చూసుకోవాలని, లేకపోతే నల్లాలను ఏర్పాటు చేయించాలని అన్నారు. తాగునీటి ట్యాంక్‌ల వద్ద టబ్బులను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్, జడ్పీ సీఈవో ఉమారాణి, డీపీవో వీరబుచ్చయ్య, డీఈవో రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నమ్మించి నగదు దోచుకున్న ఇద్దరి అరెస్టు

లక్షెట్టిపేటరూరల్, మే 9: పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కున్నారపు లచ్చవ్వ అనే మహిళకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేసిన ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ నరేందర్, ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. లచ్చవ్వ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతోంది. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన శివరాత్రి సదయ్య, పెద్దపల్లి మండలం తుర్కల మద్ది కుంటకు చెందిన గాదాసు రాజయ్యలు ఈ నెల 7న లచ్చవ్వ భర్త బయ టకు వెళ్లడం గమనించి ఇంటి నిర్మాణ పనులకు సిమెంటు, ఇటుక పంపి స్తున్నామని, రూ.25 వేలు ఇవ్వామన్నాడని చెప్పారు. లచ్చవ్వ రూ.24 వేలు ఇవ్వగా అక్కడ నుంచి వెళ్లిపోయారు. భర్త ఇంటికి వచ్చిన తర్వాత తాను ఎవర్ని పంపలేదని చెప్పడంతో మోసపో యానని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక కరీంనగర్ చౌరస్తాలో పోలీసులు వాహనాన్ని చూసి పారి పోతుండగా పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. నింది తుల నుంచి రూ. 23 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ చంద్రకుమార్

వడదెబ్బతో ఉపాధిహామీ కూలీ మృతి

కాల్వశ్రీరాంపూర్, మే 9: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన తిప్పని వెంకటలక్ష్మి(56) గురువారం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తూ వడదెబ్బకు గురైంది. పనిచేసే చోటనే అస్వస్థకు గురికాగా వెంకటలక్ష్మిని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

కోరుట్ల, మే 9: పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన బొగడమీది గౌరీ (32) అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆశోక్-గౌరీ దంపతులు కూలీ పనులు చేస్తూ అల్లమయ్య గుట్ట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చిన ఆశోక్ తన వెంట మటన్ తీసుకురాగా వంట విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఆశోక్ చుట్టు ప్రక్కల వారి సహకారంతో గౌరీని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు గౌరీని మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు తెలిపారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ గౌరీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గౌరీ సోదరుడు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గౌరీకి ఇద్దరు మగపిల్లలు ఉన్నారు.

ఇందిరమ్మ కాలనీలో కార్డన్‌సెర్చ్



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి, మే 9: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పోలీసులు గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ప్రతీ ఇంటిని సోదా చేశారు. కొత్త వ్యక్తుల సమాచారాన్ని సేకరించారు. వాహనాల రిజిస్ట్రేషన్ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వస్త్ర వ్యాపారులు, ఆసాములకు బెదిరింపులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, మే 9: కాంగ్రెస్ నాయకులు కొందరు వస్త్ర వ్యాపారులను, ఆసాములను బెదిరింపులకు గురి చేస్తున్నారని, బలవంతంగా స్టేట్‌మెంట్స్ ఇప్పిస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్‌రెడ్డి క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానని బోగస్ ముచ్చట చెప్పాడన్నారు. ఐదు సంవత్సరాలలో ఏ పల్లె ఎరగని బండి సంజయ్ తెల్లారితే మోదీ, రాముడు, మతం పేరిట గెలవాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. వస్త్ర పరిశ్రమపై ప్రేమ ఉంటే వెంటనే బకాయిలను విడదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల లోపు వస్త్ర పరిశ్రమకు, వ్యాపారులకు, ఆసాములకు, కార్మికులకు తీపి కబురు చెప్పాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు కోసం ప్రచారంలో భాగంగా సిరిసిల్లకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా
ఐదుగురికి గాయాలు

ధర్మారం, మే9: ధర్మారం మండల కేంద్రంలోని ధర్మారం-పెద్దపల్లి రహదారిపై ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి అదుపు తప్పి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఇందులో ముగ్గురికి తీవ్ర గాయాలు గాయాలు కాగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గురువారం రాత్రి ధర్మారంలో జరిగిన మంత్రి శ్రీధర్ బాబు రోడ్ షోకు గోపాల్‌రావుపేట గ్రామం నుంచి 8మంది వచ్చారు. తిరి గి ఆటోలో గోపాల్‌రావుపేటకు వెళ్తుండగా ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జంగిలి బక్కయ్య, అందె తులశమ్మ, ఆటో డ్రైవర్ పోతు లచ్చయ్యలకు తీవ్ర గాయాలు కాగా శనిగారపు రాజమ్మ, బింగి మల్లమ్మలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పగలు వ్యాపారం.. రాత్రిపూట దొంగతనాలు

- ఘరానా దొంగను అరెస్టు చేసిన పోలీసులు

కుకునూరుపల్లి, మే 9: పగటిపూట బట్టలు అమ్ముతూ, రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి, సీఐ లతీఫ్‌తో కలిసి గురువారం విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి వివరాలను వెల్లడించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం బర్కత్పుర కాలనీకి చెందిన షేక్ సలీం(53) ఊరూరు తిరుగుతూ బట్టలు అమ్ముతుంటాడు. సలీంకు వచ్చే డబ్బు సరిపోకపోవడంతో రాత్రిపూట దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. సంవత్సర కాలంగా గ్రామాలు, పట్టణాలలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నాడు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాల్లో ఉన్న నగదును ఎత్తుకెళ్లేవాడు. కుకునూరుపల్లి బస్టాండ్ ఆవరణలో బుధవారం రాత్రి అనుమానాస్పదంగా కనిపిస్తూ ఉన్న సలీంను పోలీసులు పట్టుకొని విచారించగా సంవత్సర కాలంగా రాత్రిపూట దొంగతనాలు చేస్తున్నారని ఒప్పుకున్నాడు. సిద్దిపేట, చేర్యాల పట్టణాల్లో, వంటిమామిడి, కొడకండ్ల, నారాయణరావుపేట్ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడ్డాడు. భారీ మొత్తంలో బంగారం, నగదును దొంగిలించాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన సీఐ లతీఫ్, ఎస్సై శ్రీనివాస్, క్రైమ్ పార్టీ సిబ్బంది రమేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఈదురు గాలులు.. వర్షం

- తడిసి ముద్దయిన ధాన్యం
- లేచిపోయిన ఇళ్ల పై కప్పు రేకులు
- అన్నదాతల అవస్థలు
- కొనుగోళ్లు వేగవంతం చేయాలని వినతి



కొనుగోలు కేంద్రంలో నిలిచిన వర్షం నీరు

కథలాపూర్, మే 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గురువారం ఈదురు గాలులు.. వర్షం కురిసింది. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్లు, ఈదురుగాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించాయి. కలికోట, అంబారిపేట, ఇప్పపల్లి, పోతారం గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి ముద్దయింది. రైతులు ధాన్యం ఆరబెట్టుకోగా అనూహ్యంగా కురిసిన వర్షం వల్ల పూర్తిగా ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తూకం వేసిన ధాన్యం సంచులు తడిచిపోవడంతో మొలకలెత్తే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొం టున్నారు. అదేవిధంగా పెగ్గెర్ల, ఊటీపల్లి గ్రామాల్లో ఈదురు గాలులకు ఇళ్లపై ఉన్న రేకులు ఎగిరి పడ్డాయి. ధాన్యం వద్ద నీళ్లు నిలవగా రైతులు మరో చోటికి తరలించుకుంటున్నారు.

బీర్‌పూర్: మండలంలో గురువారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. 15 నిమిషాల పాటుగా కుండపోతగా కురిసింది. ఆకస్మాత్తుగా కురిసిన వర్షం కారణంగా బీర్‌పూర్‌లోని రెండు కొనుగోలు కేంద్రాలలో, తుంగూర్‌లోని కొనుగోలు కేంద్రంలో, కొల్వాయిలోని కొనుగోలు కేంద్రంలో, కండ్లపెల్లిలోని కొనుగోలు కేంద్రంలో, చెర్లపెల్లి, నర్సింహులపల్లి కొనుగోలు కేంద్రాలలో ఉన్నా వరి ధన్యం రాసులు తడిసిపోయాయి. ఒక్కసారి వర్షం రావడంతో రైతులు ధాన్యంపై కవర్లు వేయలేక పోయారు.

రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గ్రామంలో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. ఆలాగే రుద్రంగి మండల కేంద్రంలో కురిసిన వర్షనికి ధాన్యం తడిసి ముద్దయిదని రైతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాచర్ వచ్చి చాలా రోజులు గడుస్తున్నా ధాన్యం తూకం వేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చెస్తున్నారు. తడిసిన ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



మానాలలో కురిసిన వడగండ్లు



రుద్రంగిలో తడిసిన ధాన్యం



పెగ్గెర్లలో ఎగిరిపడ్డ రేకులు



బీర్‌పూర్‌లో కురుస్తున్న వర్షం

శంకర జయంతి ఉత్సవాలు ప్రారంభం



శంకరాచార్యుల వారి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మే 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ శంకర జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం వేళలో ఆలయ అర్చకులు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారి అద్దాల మండపంలో శ్రీ శంకరాచార్యుల చిత్రపటానికి ఉపనిషత్ ద్వారాభిషేకం, పూజలు గావించారు. శంకర పారాయణం, ఆధ్యాత్మిక ప్రవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలలో భాగంగా ప్రతిరోజు శ్రీ స్వామివార్లకు, శ్రీ శంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు.

మహిళా ఖైదీల పిల్లలకు ఆశ్రయం కల్పించేందుకు కృషి



జైలును సందర్శించిన సీడబ్ల్యూసీ సభ్యులు

కరీంనగర్ క్రైం, మే 9: మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి విద్య, ఆశ్రయం, ఉపకార వేత నం అందించేందుకు కృషి చేస్తామని బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ ధనలక్ష్మి అన్నారు. జైలులో ఉన్న మహిళలకు సంబంధించిన పిల్లల రక్షణ, సంరక్షణ, విద్యా తదితర విషయాలను తెలుసుకునేందుకు కరీంనగర్ బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యూసీ) ప్రతినిధులు గురువారం కరీంనగర్ జైలు అధికారులతో కలిసి జైలులోని మహిళా విభాగం బారక్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న మహిళఖైదీలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. మహిళా ఖైదీలకు పిల్లలు ఉన్నట్లయితే వారికి చేయూతనందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జైలు అధికారులు రమేశ్, సంగీత, బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగశేఖర్, విజయ్, రాధా, అర్చనరెడ్డి, జైలు అధికారులు పాల్గొన్నారు.

చేపల వేట కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి యువకుడి మృతి

- ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఘటన

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో చేపలను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగలు ముత్యాల బాలకృష్ణ (38) అనే యువకుడు గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కిషన్ అతడి స్నేహితులు పుటకుల్ల సుధీర్, బొమ్మడి శంకర్‌తో కలిసి చేపలు పట్టేందుకు గ్రామ శివారులోని మానేరు వాగులోని చెక్ డ్యాం వద్దకు వెళ్లారు. నీటిలో తీగలను అమర్చి వాటికి కరెంటు సరఫరా అయ్యేలా ఏర్పాటు చేసుకున్నారు. ప్రమాదవశాత్తు కిషన్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆందోళనకు గురైన సుధీర్, శంకర్ అక్కడి నుంచి పారిపోయారు. అక్కడే ఉన్న వ్యక్తులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లలు రోదనలు మిన్నంటాయి. సుధీర్, శంకర్‌లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మృతుడికి భార్య కావ్య, ఇద్దరు కూతుళ్లు సహస్ర, లాస్యప్రియ, కుమారుడు అఖిల్‌తేజ్ ఉన్నారు. గత యేడాది జూలై 2న అదే గ్రామానికి చెందిన బొమ్మడి నారాయణ చేపల వేటకు వెళ్లి కరెంటు షాక్‌తో మృతి చెందాడు. విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడడంతో ప్రమాదవశాత్తు ప్రాణాలను కోల్పోతున్నారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



హరీష్(ఫైల్)

పాలకుర్తి, మే 9: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. బసంత్‌నగర్‌కు చెందిన కొమ్ము హరీష్(24) సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన అకాల వర్షానికి గోడలు తడిసి పైన ఉన్న బట్టలు ఆరవేసే దండానికి విద్యుత్ సరఫరా అయ్యింది. ఇది గమనించని హరీష్ చెయ్యి పైకి లేపడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు, స్నేహితులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. అవివాహితుడైన హరీష్‌కు తల్లి, సోదరుడు ఉన్నారు. బసంత్‌నగర్ ఆలయ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రిజర్వేషన్ల రద్దు ప్రచారం కుట్ర

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్



మాట్లాడుతున్న బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

భగత్‌నగర్, మే 9: బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ ప్రచారం చేయడం వెనుక కుట్ర దాగి ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాల యంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లను కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామాలో భాగమే అన్నారు. అంబేద్కర ప్రజాస్వామ్య దేశంలోని అనేక విషయాలను జోడించి ప్రపంచంలోనే ఆదర్శమైన రాజ్యాంగాన్ని రాశారన్నారు. దళితుడైన అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించిందన్నారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్‌భగత్ మాట్లాడిన అంశాలను వక్రీకరిస్తున్నారని ఎస్.కుమార్ అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

మల్యాల, మే 9: మండలంలోని నూకపల్లి డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద గుడుంబా అమ్ముతున్న నూకపల్లికి చెందిన సిలువేరి లక్ష్మి వద్ద మూడు లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మికి గుడుంబాను సరఫరా చేస్తున్న రాజరం గ్రామానికి చెందిన తిరుమలేష్‌తో పాటు లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గుడుంబా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన గడ్డి రమేష్ అదృశ్యంపై కేసు నమోదు చేశామని పోలీసులు గురువారం తెలిపారు. తిమ్మాపూర్‌కు చెందిన రమేష్ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 7న పనులు ముగించుకొని ఇంటికి చేరుకున్న రమేష్ అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటకు వెళ్లాడు. చీకటి పడిన ఇంటికి రాకపోవడంతో రమేష్ భార్య స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి

జూలపల్లి, మే 9: మండలంలోని కాచాపూర్ గ్రామంలో గురువారం పుట్ట ప్రశాంత్(32) ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ట్రాక్టర్ నడుపుకుంటూ కటుంబాన్ని పోషించుకుంటున్న ప్రశాంత్ ఊరచెరువు సమీపంలో కల్వర్టు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో దాని కిందపడి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటర్లను ప్రలోభాలకు గురి చేసిన ఐదుగురిపై కేసు

హుజూరాబాద్, మే 9: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణంలోని కోర్టు సమీపంలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎంపీ వైద్యులకు విందు ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినందుకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఆర్ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఐదుగురి రాజకీయ నాయకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ నారాదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, వి రవీందర్‌రావు ఉన్నారు. ఈ కేసులో మరో 20మంది ఉన్నారనిఈ మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బుధవారం రాత్రి ఆర్ఎంపీ వైద్యులకు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకులు విందు ఇవ్వగా కాంగ్రెస్ నాయకులు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశాదరు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు దాడులు చేసి విచారణ చేపట్టారు.

మూడు సెల్‌ఫోన్లు చోరీ

హుజూరాబాద్, మే 9: హుజూరాబాద్ పట్టణంలో గురువారం వారసంతలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. బొప్ప రాజేందర్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చెడమావి కృష్ణమూర్తితో పాటు మరొకరు కూరగాయల కోసం మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే జేబులో ఉన్న సెల్‌ఫోన్లు మాయమయ్యాయి. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా గతంలో కూడా ఇదే వారసంతలో చాలా సెల్‌ఫోన్లను దొంగతనం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మే 9: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన ఆరుగురు వ్యక్తులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన 25 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 5 రోజులు, ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలు శిక్ష, మొత్తం 12,500 రూపాయల జరిమానాను జడ్జి విధించారని సీఐ తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 32వేల రూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

పోలీసు తనిఖీల్లో నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9: కరీంనగర్‌లో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో వేరు వేరు ఘటనల్లో సరైన ఆధారాలు లేని మొత్తం 12 లక్షల 56 వేల 3 వందల రూపాయల నగదు పట్టుబడింది. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు కరీంనగర్‌లోని పలుచోట్ల వాహనాల తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ ఒకటో ఠాణా పరిధిలోని రాజీవ్‌చౌక్‌లో నిర్వహించిన వాహనాల తనిఖీలో అశోక్‌నగర్‌కు చెందిన నార్ల నరేష్‌కుమార్ వద్ద లక్షా 60 వేలు, కమాన్‌రోడ్‌కు చెందిన విజయరాఘవన్ విబిన్ వద్ద 2 లక్షల 40 వేలు రూపాయలు పట్టుబడ్డాయి. ఈ నగదును సీజ్ చేసి తదుపరి ప్రక్రియ కోసం సంబంధిత అధికారులకు స్వాధీనం చేశామని సీఐ సరిలాల్ తెలిపారు. అలాగే మూడో ఠాణా పరిధిలోని కాపువాడ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో బహదూర్‌ఖాన్ పేటకు చెందిన టి సంజీవ్ వద్ద 3 లక్షల 76 వేల 300 రూపాయల నగదు, నాకా చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనిఖీల్లో కిసాన్‌నగ ర్‌కు చెందిన జె రమేష్ వద్ద 2 లక్షల 5 వేల రూపాయలు, కోర్టు చౌరస్తా వద్ద విద్యానగర్‌కు చెందిన పోలోజు నందం వద్ద లక్షా 75 వేలు, వావిలాలపల్లికి చెందిన జె శ్రీనివాస్ వద్ద లక్ష రూపాయల నగదు పట్టుబడిందని, ఈ నగ దును సీజ్ చేసి సంబం ధిత ఎన్నికల విభాగం అధికారులకు స్వాధీనం చేశామని సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.



పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ సరిలాల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు

- నగదు, వెండి వస్తువులు స్వాధీనం

కరీంనగర్‌లోని కోర్టుచౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో గంగాధర మండలం ఘర్షకుర్తి గ్రామానికి చెందిన కట్ట శ్రీనివాసచారి వద్ద సరైన ఆధారాలులేని 4 లక్షల 36 వేల 300 రూపాయల నగదును పట్టుకున్నారు. అలాగే గుంటూరు జిల్లా తెనాలి మండలం, నెలపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గొప్ప రాజు వద్ద దాదాపు 3 లక్షల విలువైన 4 కిలోల వెండి వస్తువులు బహుమతులను పట్టుకున్నట్లు రెండో ఠాణా సీఐ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. పట్టుబడిన నగదు, వెండి బహుమతులను తదుప రి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

జగిత్యాలలో తనిఖీలు

జగిత్యాల టౌన్, మే 9 : జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, మంచినీళ్ల బావి, బైపాస్ రోడ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల వద్ద రూ. 13.5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి పత్రాలు లేని వాహనాలు పట్టుకుని జరిమానాలు విధించారు.

కొండగట్టులో యువకుడి ఆత్మహత్య

మల్యాల, మే 9: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన సిరిగిరి సమ్మయ్య(37)అనే వ్యక్తి దిగువ కొండగట్టులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో జరిగిన రైలు ప్రమాదంలో కుడి కాలు, చేతి కోల్పోవడంతో తీవ్ర మనస్తాపంతో ఉన్న సమ్మయ్య కుటుంబపోషణకు గాను పని చేయడానికి వారం రోజుల క్రితం కొండగట్టు వచ్చాడు. అయితే గురువారం ఓ హోటల్ ముందు మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సమ్మయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు

ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎల్లారెడ్డిపేట, మే 8: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ఏకలవ్య గురుకుల కళాశాలల్లో ప్రవేశాల కోసం 2023-2024 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకులాల ఆర్‌సీవో డీఎస్. వెంకన్న గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట(బాలికలు), మరిమడ్ల(బాలురు) కళాశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 9 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ప్రతిభ ఆధారంగా ఈ నెల 24న ఉదయం 9 గంటల నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఏకలవ్య గురుకులంలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ప్రారంభమైన ఎప్‌సెట్

- జిల్లా వ్యాప్తంగా 9 కేంద్రాల ఏర్పాటు

తిమ్మాపూర్, మే 9: ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ పరీక్షలు శుక్రవారం, శనివారం కూడా కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు గురువారం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు సెషన్‌లలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 9 గంటల నుంచి జరిగిన మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2,449 మందికి 2393 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 56 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,450 మందికి 2395 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 55 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని నిర్వాహకులు తెలిపారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుంచే విద్యార్థులనుఅనుమతించారు.

కొనుగోలు కేంద్రాలకు స్థలాల కొరత

- రోడ్ల పైనే ధాన్యం కుప్పలు

- ప్రమాదమని తెలిసినా రైతన్నకు తప్పని దుస్థితి

పెగడపల్లి, మే 9: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు లేక ఆరుగాలం శ్రమించి ధాన్యం పండించిన రైతన్నలు ఇబ్బందులు పడుతున్నారు. పెగడపల్లి మండలంలోని 23 గ్రామాలు ఆయకట్టు పరిదిలోని ఉన్నాయి. మండలంలోని 90 శాతానికి పైగా భూములలో వరి పంటనే సాగు చేస్తారు. పండించిన ధాన్యాన్ని విక్రయించుకునేందుకు మండలంలోని పెగడపల్లి, నంచర్ల, నందగిరి సహకార సంఘాలతో పాటు సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల చేత ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోల్లు చేస్తున్నారు. ఆయా గ్రామాలలోనే రైతులకు అందుబాటులోనే కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికి వాటికి సరైన స్థలాలు లేక ప్రధాన రహదారులైన తారు రోడ్లకు ఇరువైపులా ధాన్యం కుప్పలు పోసి తూకం వేయించుకోవాల్సిన పరిస్థితులు అన్ని గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలలో ఉంది. దీనికి తోడు గుట్ట బోర్లకు, పంట పొలాలలో కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎగుడు దిగుడు భూములలో ధాన్యం పోసి చిన్న పాటి వర్షం వచ్చినా ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. గుట్టబోర్ల పైన ఏర్పాటు చేసిన కేంద్రాలలో ఏ కొద్ది వర్షం పడినా ధాన్యం కొట్టుకు పోతుండగా , పంట పొలాలలో ఏర్పాటు చేసి కేంద్రాలలో వర్షాలు కురిసినపుడు ధాన్యం కుప్పలు, తూకం వేసిన సంచులు తడిసిపోతున్నాయి. దీంతో తూకం వేయకపోవడం తడిసిన ధాన్యం పేరిట తరుగు తీయడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మండలంలో ప్రతి పంటకు 3.50 లక్షల నుంచి 4 లక్షల క్వింటాల్ల వరకు ధాన్యం తూకం వేస్తుండగా మండలంలోని 23 గ్రామాలలో ఎక్కడా కూడా శాశ్వత స్థలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు అధికారులకు ప్రతి యేటా రైతులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు. రైతుల శ్రేయస్సు గురించి మాట్లాడే ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలు చూపించి సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్పలు

శాశ్వత స్థలాలు కేటాయించాలి..

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలను కేటాయించి శాశ్వత కేంద్రాలు ఏర్పాటు చేయాలి, ఎంతో కష్టపడి పండించిన ధాన్యం విక్రయించుకుందామంటే సరైన కేంద్రాలు లేక మట్టిలో, ఎగుడు దిగుడు స్థలాలలో ధాన్యం కుప్పలు పోసి ఇబ్బందులు పడుతున్నాం. పండించిన ధాన్యం మట్టిలో కలసిపోతోంది. కొనుగోలు కేంద్రాలలో సిమెంట్ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేసి ధాన్యం మట్టిలో కలసి పోకుండా చూడాలి.

- ప్రశాంత్ రావు. పెగడపల్లి.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోనాలతో మహిళలు

ఇల్లంతకుంట, మే 9: మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలో గురువారం ఘనంగా పోచమ్మ బోనాలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తూముకుంట శ్రీలతనరేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి

సిరిసిల్ల టౌన్, మే 9: తెలంగాణలోని మాజీ సర్పంచ్‌లు కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల్‌కార్ శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సర్పంచులను గుర్తించిన కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో మాజీ సర్పంచ్‌లకు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చిందన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం ప్రకారం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరెడ్డి మల్లారెడ్డి, అధికార ప్రతినిధి మల్లేశంగౌడ్, గౌరవ సలహాదారు గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు సుజాతనర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి మల్లేశంగౌడ్, జిల్లా కార్యదర్శి సత్యం, నాయకులు పాల్గొన్నారు.

మల్లేశం మరణం పార్టీకి తీరని లోటు

సిరిసిల్ల టౌన్, మే 9: సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో మల్లేశం స్మారక సభను నిర్వహించారు. ముందుగా మల్లేశం చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ మల్లేశం 45 ఏళ్లు పార్టీకి విశిష్ట సేవలను అందించారన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ వేడుకలకు హాజరైన కొండూరు

వీర్నపల్లి, మే 9 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామంలో జరిగే బీరప్ప కామరాతి కల్యాణ వేడుకలకు నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జడ్పీటీసీ కళావతి, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్ ఉన్నారు.

కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌కు తరలిరావాలి

వీర్నపల్లి, మే 9 : వీర్నపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌కు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కార్నర్ మీటింగ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరుకానున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త గ్రామాల్లో సైనికుడిలా పని చేయాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధుల చేరిక

ముస్తాబాద్, మే 9: ముస్తాబాద్ పట్టణ మాజీ సర్పంచ్ మట్ట రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ కుక్కల దేవేందర్ కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో గురువారం ఆ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్లమెంటరీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, పార్లమెంటరీ కో ఇన్‌చార్జి కనమేని చక్రధర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నర్సింగరావు, విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీతోనే రాజ్యాంగ రక్షణ

రుద్రంగి, మే 9: భారత రాజ్యాంగం రక్షణ బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యమని వేములవాడ నియోజకవర్గం బీఎస్పీ అధ్యక్షుడు గసికంటి అరుణ్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి మారేపల్లి మొగిలయ్యకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు దర్శనం గంగాధర్, ఉదయ్, సతీష్, అనిల్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వీర్నపల్లి, మే 9 : మండలానికి చెందిన సీనియర్ నాయకులు మాడుగుల లక్ష్మీరాజం, అన్నారం శేఖర్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో కాషాయం కండువాకా కప్పుకున్నారు. బీఆర్ఎస్ మాజీ మండల యూత్ అధ్యక్షుడు పేరం ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

వీర్నపల్లి, మే 9 : వీర్నపల్లి మండలం మద్దిమల్ల తండా గ్రామానికి చెందిన మాలోత్ రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు ఆర్థికసాయం అందించారు. గురువారం రూ.5 వేలను స్థానిక నాయకులు బాధిత కుటుంబానికి అంద జేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జవహర్‌లాల్, సుదర్శన్, నాయకులు రఫీ, సంతోష్, సోషల్ మీడియా కన్వీనర్ ప్రకాష్, ఉన్నారు.

మహిళ అదృశ్యం

సిరిసిల్ల క్రైం, మే 9 : సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన గడ్డం శ్రీలత అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు గురువారం పోలీసులుకు ఫిర్యాదు చేశారు. చేయని తప్పునకు తనను ఇబ్బంది పెడుతున్నారని లేఖరాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని పేర్కొన్నారు.

రెండు రోజులే మిగిలింది



- దూకుడు పెంచిన పార్టీలు
- పెరిగిన స్థానిన నాయకుల ప్రచారాలు
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో వేడెక్కుతున్న రాజకీయం
- కొనసాగుతున్న వలసలు
- ఇప్పటికే ప్రధాని నరేంద్రమోదీ, సీఎం రేవంత్‌రెడ్డి సభలు
- నేడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వానికి మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. శనివారం సాయంత్రం ప్రచారానికి తెరపడనుంది. ప్రచారం చివరి అంకానికి చేరుకోవడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న సిరిసిల్ల, వేములవాడ, సెగ్మెంట్‌లలో ప్రచార జోరును పెంచారు. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎంపీ వినోద్‌రావుకు మద్దతుగా ఆయా పార్టీల నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల అగ్రనేతలు ప్రచార జోరును పెంచారు. వేములవాడలో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా నిర్వహించిన జనసభ లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగించారు. భారీ జన సమీకరణ చేపట్టడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరిగింది.

కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్లలో నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థికి మద్ద తుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు రోడ్‌షో నిర్వహించారు. స్థానిక నాయకులు ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో మరింత ఊపును తెచ్చే దిశగా శుక్రవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బస్ యాత్రలో భాగంగా రోడ్‌షోలో మాట్లాడనున్నారు. సభను విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు జన సమీకరణకు ఏర్పాట్లు చేశారు. రెండు రోజులే గడువు ఉండడంతో అన్ని ప్రయత్నాలతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.

ఆగని వలసలు

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో లోక్‌సభ ఎన్నికల ముగింపు దశకు చేరుకుంటున్న క్రమంలో వలసల పరంపర జోరందుకుంది. కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు పెరిగాయి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్, బీజేపీలోకి వెళ్లిన నాయకులు తిరిగి సొంత గూటికి చేరుకుంటున్నారు. అధికారం లేనప్పుడు కూడా కాంగ్రెస్‌లో ఉన్ననేత ల్లో తిరిగి వస్తున్న నాయకులపై అసంతృప్తి వ్యక్తమ వుతోంది. రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా మాజీ సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇప్పటికే మండలాల్లో స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో చేరారు. వారి ప్రభావం కాంగ్రెస్‌కు ఎంతవరకు కలిసివస్తుందనేదానిపై ఆసక్తి నెలకొంది.

నియంతృత్వ బీజేపీని ఓడించాలి



కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 9 : పదేళ్లుగా నియంతృత్వ పోకడలతో పాలన సాగిస్తున్న బీజేపీని ఓడించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రజలను కోరారు. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా గురువారం రాత్రి వేములవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పేదలకు కాంగ్రెస్ ద్వారానే న్యాయం జరుగుతుందని, దేశంలో పార్టీ అధికారంలోకి రాగానే పాంచ్ న్యాయ పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. కేసీఆర్ వేములవాడ రాజన్నకు ఏటా 100 కోట్లు ఇస్తానని మోసం చేశారని, మోదీ వస్తే మా రాజన్నకు ఏమన్నా ఇస్తారనుకున్నామని అన్నారు. ఉత్తర కాశీలో పోటీ చేసి గెలిచిన మోదీ దక్షిణ కాశీ వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చి ఉట్టి చేతులతో వెళ్లారని అన్నారు. నరేంద్ర మోదీకి కేసీఆర్ లాగే మన ప్రాంతం పైన ఏమాత్రమూ ప్రేమ లేదని, కేవలం ఓట్ల కోసమే మోదీ వేములవాడకు వచ్చారని అన్నారు. ఎన్నికలలో చేతి గుర్తుపై ఓటు వేసి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు

వేములవాడ రూరల్: కార్పొరేట్ ప్రభుత్వం బీజేపీకి పార్లమెంటు ఎన్నికల్లో వీడ్కోలు చెప్పాలని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తుర్కాషినగర్, ఫాజుల్‌నగర్, వట్టెంల, నిమిలిగుండుపల్లి, నూకలమర్రి గ్రామాల్లో ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల పక్షాన నిలిచే కాంగ్రెస్ ప్రభుత్వానికి అసెంబ్లీ ఎన్నికల్లో ఆశీర్వదిం చినట్లే పార్లమెంటు ఎన్నికల్లో అండగా నిలిచి పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను గెలిపించాలన్నారు. బీజేపీకి తిరిగి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తారన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందన్నారు.పార్టీ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, ఎంపీటీసీ రంగు వెంకటేశం, సంపు స్వామి, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ నిర్వాకంతోనే అప్పుల తెలంగాణ



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

గంభీరావుపేట, మే 9: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వాకంతోనే రాష్ట్రం అప్పుల తెలంగాణగా మారిందని సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో దాదాపు 200 మంది మహిళలు కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన సమయంలో రూ.60 వేల కోట్ల మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రం కేసీఆర్ పుణ్యమా అని రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్ ఈ ప్రాంత బిడ్డ కాదు కాబట్టే కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజీ పనుల ఆపేసి, 10, 11, 12 ప్యాకేజీ పనులను పూర్తి చేయించి నీళ్లు తీసుకెళ్లారన్నారు. 9వ ప్యాకేజీ పనులను పండబెట్టి ఈ ప్రాంత పంటలను ఎండబెట్టిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. ఆనాడు అనేక మంది యువకులు తెలంగాణ రాష్ట్రం కోసం బలిదానాలు చేసుకుంటే చలించిన సోనియాగాంధీ ఆత్మహత్యలను ఆగాలని తెలంగాణ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నీటి మూటలుగా మారాయన్నారు. కాంగ్రెస్ బడుగు బలహీన వర్గాల పార్టీ అని, అన్ని వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. బీజేపీ ఓటు బ్యాంక్ రాజకీయం చేస్తోందని కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. రాముడి అక్షింతల బండి సంజయ్ ఓట్లు అడుగుతున్నారన్నారు. తామంతా రాముడిని నిత్యం పూజిస్తామని, ఏనాడూ దేవుడి పేరు చెప్పి రాజకీయం చేయలేదని అన్నారు. కరీంనగర్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

నిరుపేదల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం



కాంగ్రెస్‌కు ఓటువేయాలని కోరుతున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, మే 9: నిరుపేదల అభివృద్దే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా గురువారం పొత్తూర్, నర్సక్కపేట, జవారిపేట, గాలిపెల్లి, తాళ్లపల్లి, పత్తికుంటపల్లె, కేసన్నపల్లె, ముస్కానిపేట, వంతడుపుల గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై సంపూర్ణమైన అవగాహన ఉన్న రాజేందర్‌రావును గెలిపించడం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రంలో చేసిన అరాచక పాలనకు విముక్తి కలిగించిన ప్రజలు, కేంద్రంలో బీజేపీని ఓడించి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. రైతుల రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కొంతమంది నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ అయిలయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు అడగని అసమర్థుడు బండి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ, మే 9: ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని నరేంద్ర మోదీని నిధులు అడిగే దమ్ము, ధైర్యం లేని అసమర్థుడు బండి సంజయ్ కుమార్ అని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు విమర్శించారు. గురువారం వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిధులు అడిగే ధైర్యం కూడా బండి సంజయ్ చేయకపోవడం బాధాకరమన్నారు. ఐదేళ్ల కాలంలో ఎంపీగా బండి సంజయ్ ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేదని, కేంద్రం నుంచి ఒక రూపాయి కూడా తీసుకు రాలేదని అన్నారు. దక్షిణ భారతంలో వస్తున్న ఆదాయాన్ని ఉత్తర భారతంలో ఖర్చు పెడుతున్న ప్రధాని మోదీ మొదటి నుంచి దక్షిణాది మీద వివక్ష చూపుతున్నారన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రాన్ని సందర్శించినా ఆలయ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ప్రకటించకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ నెల 10న సిరిసిల్లలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. పదో తరగతిలో మొదటి పేపర్ ఆది శ్రీనివాస్ పాస్ అయినట్లుగానే రెండవ పేపర్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు గెలిపించాలని వేములవాడలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను చల్మెడ లక్ష్మీనరసింహారావు తిప్పి కొట్టారు. మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, పార్టీ అధ్యక్షులు గోస్కుల రవి, కౌన్సిలర్లు విజయ్, మారం కుమార్, శంకర్, గోలి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలిచ్చే పార్టీలకు బుద్ధి చెప్పాలి



బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు గిరిజనులు

వీర్నపల్లి, మే 9: అబద్ధపు హామీలను ఇచ్చే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. గురువారం మండలంలోని మద్దిమల్ల గ్రామంలో జరిగే బీరప్ప కామరాతి కల్యాణ వేడుకలకు పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి తుల ఉమతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వీర్నపల్లి మండలం ఎర్రగడ్డ తండా గ్రామంలో గిరిజనులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత హామీలు ఇచ్చి రైతులను, మహిళలను మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వంలో ఎంపీగా ఉన్న బండి సంజయ్ వీర్నపల్లి మండలానికి నయా పైసా అభివృద్ధి చేయలేదన్నారు. పేదల సంక్షేమం కోసం అన్ని వర్గాలను అభివృద్ధి చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ అండగా నిలిచిందన్నారు. తండాకు చెందిన సుమారు 20 మంది వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుగులోతు కళావతి, మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్ నాయక్, బొప్పాపూర్ మాజీ ఏఎంసీ డైరెక్టర్ బోనాల శ్రీధర్, గ్రామ అధ్యక్షుడు బానోతు అనిల్, సీనియర్ నాయకులు సంతోష్, రాజు నాయక్, గజన్‌లాల్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం

ఎల్లారెడ్డిపేట, మే 9: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, కోరుట్లపేట, పదిర, హరిదాస్‌నగర్, అక్కపల్లి తదితర గ్రామాల్లో కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్‌కు మద్దతుగా గురువారం ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పార్లమెంటు ఎన్నికల్లో మూడో సారి బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, బుగ్గారెడ్డి, గణేశ్, శ్రీశైలం, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, బాలయ్య, స్వామి, కృష్ణహరి, రామచంద్రారెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కరీంనగర్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు గోపాడి సురేందర్ రావు కోరారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ తదితర గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ప్రధానమంత్రి మోదీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. మూడోసారి మోదీని ప్రధానమంత్రి చేయడానికి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. బీజేపీ నాయకులు గొట్టే రామచంద్రం, బాలాజీ, బెంద్రే శ్రీనివాస్, వెలిశాల రవి పాల్గొన్నారు.

సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ మోసం



జగదాంబతండాలో మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, మే 9: ఎన్నికల సమయంలో సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అన్నారు. గంభీరావుపేట మండలం జగదాంబతండాలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అధికారం దక్కించుకోవాలనే ఆత్యాశతో అబద్ధపు హామీలు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దే అన్నారు. ఆరు గ్యారంటీల్లో ఉచిత బస్ మినహా అన్ని హామీలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కేవలం 4 నెలల వ్యవధిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. బీజేపీ తరపున ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న బండి సంజయ్ గడిచిన 5 ఏళ్లలో ప్రజలకు చేసింది శూన్యమన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్ కుమార్‌కు ప్రజల నుంచి స్పందన లభిస్తోందన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచిన బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని పార్లమెంటు ఎన్నికల సిరిసిల్ల నియోజక వర్గ పరిశీలకురాలు, ఉమ్మడి జిల్లా మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా గురువారం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామాల్లోని ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో సమావేశమయ్యారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు నిర్మలారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఎంపీటీసీ గీతాంజలి ఉన్నారు.

● మండల కేంద్రంతో గ్రామాల్లో స్థానిక నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కరీంనగర్ పార్లమెంటరీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ శరత్‌రావు, మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఎద్దండి నర్సింహరెడ్డి పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: బీఆర్ఎస్ పాలనలోనే మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్, ఉడుతల వెంకన్న అన్నారు. మండలంలోని పొత్తూర్, వెల్జీపూర్, పెద్దలింగాపూర్ గ్రామాలలో గురువారం బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు మాతిరెడ్డి కిషన్‌రెడ్డి, మీసరగండ్ల అనీల్‌కుమార్, ముత్తయ్య పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: బోయినిపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు నూకలమర్రి, నమిలిగుండుపల్లి గ్రామాలలో గురువారం గురువారం ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ప్రవీణ్, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి ఉపాధి హామీకూలీలను కలిసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు ఏశ తిరుపతి పాల్గొన్నారు.

కోనరావుపేట : కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను గెలిపించాలని ఆ పార్టీ నేత స్వయంప్రభ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో గురువారం ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మంజుల, నాగుల రాజు, గోపి రావు పాల్గొన్నారు.

చందుర్తి: అభివృద్ధి చేసే నాయకున్ని ఎన్నుకోవాలని మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్, ఆశిరెడ్డిపల్లె గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్ద బీఆర్ఎస్ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ బైరగోని లావణ్య రమేష్, కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి : కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కూమార్‌ను గెలిపించాలని రుద్రంగి మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకుల ఇంటింటా ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ స్వరూపరాణి మహేష్, సెస్ డైరెక్టర్ గంగారాం, ఎంపీటీసీ లావణ్య రాజేశం పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తుల ఉమ

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



లింగాపూర్‌లో మాట్లాడుతున్న కొండూరు గాంధీ

సిరిసిల్ల రూరల్/ఎల్లారెడ్డిపేట, మే 8: పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సోదరి రోహిణి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్ గ్రామాల్లో రాజేందర్‌రావు సోదరి రోహిణి ఇంటింటా తిరుగుతూ కర పత్రాలను అందిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, బాబు, రాజునాయక్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, పెద్దబోనాల, చంద్రంపేట గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరదేవరాజు, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని అనంతగిరి, పెద్దలింగాపూర్ గ్రామాలలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ పాశం రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంభీరావుపేట : అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కరీంనగర్ పార్లమెంట్ కో ఇన్‌చార్జి కొండూరు గాంధీ అన్నారు. గంభీరావుపేట మండల నాగంపేట, మల్లుపల్లె, లింగాపూర్ గ్రామాల పరిదిలోని ఉపాధి కూలీలతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగంపేట ఎంపీటీసీ భూషనం, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి, నాయకులు ఉన్నారు.

ముస్తాబాద్: సెమీఫైనల్స్‌లో గెలిచామని, ఫైనల్స్‌లోనూ గెలుపు తమదేనని ఎన్ఎస్‌యూ నియోజక వర్గ ప్రెసిడెంట్ మిరుదొడ్డి భానుకుమార్ అన్నారు. ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, నామాపూర్, కొండాపూర్ మొర్రాయిపల్లె, చీకోడ్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారాన్ని నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంటరీ కో ఇన్‌చార్జి కనమేని చక్రధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

వేములవాడ : కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా గురువారం వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్, చిలుక రమేష్, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, నాయకులు రాంబాబు, దేవయ్య, ఫిరోజ్ పాషా పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారాన్ని గురువారం కొనసాగించారు. మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా మాట్లాడుతూ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

చందుర్తి : కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌ను గెలిపించాలని సీపీఐ నాయకుడు కడారి రాములు అన్నారు. చందుర్తి మండలం ఎనగల్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి రాజేందర్ రావుకు మద్దతుగా గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పండుగ చంద్రయ్య, పండుగ పోషన్న, ఆకుల ఆంజనేయులు పాల్గొన్నారు.

రుద్రంగి: కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని రుద్రంగి మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు కులసంఘాల వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ గట్ల మీనయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, కెసిరెడ్డి నర్సరెడ్డి, ఇప్ప మహేష్ పాల్గొన్నారు.



వేములవాడలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు